క్లుప్తంగా

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి



డ్రైవర్ల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): ప్రయాణికులతో ఆర్టీసీ డ్రైవర్లు మర్యాదగా మెలగాలని, ప్రమాదాలు సంభవించకుండా జాగూరకతో డ్రైవింగ్ చేయాలని జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి ఎన్వీఆర్ వర ప్రసాదరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు శనివారం రెండో రోజు డ్రైవర్లకు ప్రమాద నివారణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. డ్రైవర్లు ప్రశాంత విధి నిర్వహణలో అంకిత భావంతో ఉండాలని వరప్రసాదరావు పేర్కొన్నారు. వచ్చేనెల 1వ తేదీన నిర్వహించే రక్తదాన శిబిరం, రక్తదానం వల్ల కలిగే ఉపయోగాలు రెడ్‌క్రాస్ పీఆర్‌ఓ వెంకటరమణ వివరించారు.

30న ఏలూరుకు సమర యాత్ర

ఏలూరు (టూటౌన్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమర యాత్ర ఈనెల 30న ఏలూరు రానుందని పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షులు యం.క్రాంతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యు.శంకర్ తెలిపారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న యాత్ర సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ యూనివర్సిటీలను జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కె.లెనిన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహర్షి పాల్గొన్నారు.

ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టాన్ని తీసుకురావాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి బద్దా వెంకట్రావు కోరారు. ఏలూరు గూడ్స్ షెడ్ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్మికుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే గూడ్స్ షెడ్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి భద్రతతో కూడిన, రక్షణతో కూడిన చట్టాన్ని తీసుకు రావాలని కోరారు. కార్మికుల హక్కుల రక్షణకు ప్రభుత్వాలు ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో హమాలీలు బావిశెట్టి కేశవ, సాంబశివ, నాగరాజు, సాయి,ఏసు, బాలాజీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రథ సప్తమి పర్వదినం సందర్భంగా శనివారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్‌పేటలోని సూర్య భగవానుని ఆలయం, రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు విశేష పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ మేయర్ దంపతులను సత్కరించారు. సూర్యభగవానుడిని కొలవడం ద్వారా హిందువులు గ్రహారాధనను ప్రపంచానికి చాటి చెప్పారని మేయర్ దంపతులు పేర్కొన్నారు. పాతబస్టాండు సమీపంలోని పాండురంగ స్వామి దేవస్థానంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, కంకణ ధారణ, సూర్యనారాయణ ఆవాహన పూజలు చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు సామూహికంగా పాలు పొంగించారు. అరుణపారాయణ, సూర్య నమస్కారాలు, సూర్య హోమం నిర్వహించి విశేష హారతులు పట్టారు. అనంతరం సుమారు 300 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ గుత్తుల బాలా త్రిపుర సుందరి దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

విద్యార్థులతో సూర్య నమస్కారాలు

తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథ సప్తమి పర్వదినం సందర్భంగా శనివారం స్థానిక తంగెళ్లమూడి పుష్ప లీలా నగర్‌లోని సరస్వతి విద్యానికేతన్‌లో ట్రైనర్ దుర్గా ప్రసాద్ విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. రథ సప్తమి పర్వదిన విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వై.ఉదయ్ కుమార్, వివేకానంద కేంద్ర ప్రతినిధి ఎం.నరేష్, తెలుగు పండితులు మల్లెల సూర్యనారాయణ పాల్గొన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించారు.





పవరుపేటలో సూర్యభగవానుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

సూర్యనారాయణసేవలో ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): పవరుపేటలోని సూర్యాలయంలో సూర్యనారాయణ స్వామివారిని ఎమ్మెల్యే ఆళ్ల నాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడుపుతున్నారని, వారిపై సూర్యనారాయణ స్వామి ఆశీస్సులు ఉండాలని అన్నారు. జగన్‌ను మళ్లీ సీఎం పీఠం ఎక్కించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. తొలుత నానికి ఆలయ మర్యాదలతో ట్రస్టుబోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయరు గుడిదేశి శ్రీనివాసరావు, మధ్యాహ్నపు బలరాం తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకరణలో పవరుపేట సూర్యభగవానుడు



ఆర్ఆర్‌పేటలోని సూర్యప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

మాదేపల్లి నుంచి గురుకులపేట వరకు 50 శాతం నిర్మాణం పూర్తి

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గం కైకలూరు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మాదేపల్లి నుంచి గురుకులపేట వరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు 50 శాతం పూర్తయ్యాయి. రోడ్డు మార్జిన్ కోతకు గురికాకుండా మహేశ్వరపురం ప్రాంతంలో రోడ్డుకు రెండు వైపులా కాంక్రీట్‌తో రివెట్‌మెంట్ వాల్ నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.20.72 కోట్లు మంజూరు చేసింది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పనుల పురోగతి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించిందని అధికారులు చెబుతున్నారు. సుమారు 7 కిలో మీటర్ల దూరం గల ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం తొలుత రూ.6.64 కోట్లు వెచ్చించింది. ఇందులో భాగంగా అధికారులు శ్రీపర్రు గ్రామం వద్ద సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. కాలువలు ఉన్న ప్రాంతంలో నీటి పారుదలకు కల్వర్టులు నిర్మించారు.



కైకలూరు రోడ్డు మార్జిన్‌లో బురద మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్



మహేశ్వరపురం శివారున కైకులూరు రోడ్డు మార్జిన్‌ను పటిష్టం చేస్తున్న దృశ్యం

పట్టించుకోని గత పాలకులు



“ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి వల్ల కైకులూరు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత పాలకులు కైకులూరు రోడ్డు అభివృద్ధి కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల సాఫీగా సాగుతుంది.

– మండల కొండలరావు, శ్రీపర్రు

కైకలూరు రోడ్డు పనులు బాగున్నాయి



రోడ్డు పనులు మరో 20 ఏళ్ల వరకు మన్నిక కలిగేలా నిర్వహిస్తున్నారు. నాణ్యతలో రాజీ పడడంలేదు. మార్జిన్ పెంపుతో భవిషత్తులో ట్రాఫిక్ సమస్య ఉండదు. గత ప్రభుత్వం తూతూ మంత్రంగా పనులు చేసింది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో కై కులూరు రోడ్డు ప్రజలు మెచ్చేలా ఉంటుంది.

– తేరా ఆనంద్, మానూరు

సమాచార హక్కు చట్టంతో పారదర్శకంగా పరిపాలన



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్) : ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే ప్రతి విషయాన్ని తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారని, తద్వారా పారదర్శకంగా పరిపాలనను ప్రజలకు అందించే వీలుంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాలనీలో శనివారం ఏర్పాటుచేసిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ చట్ట ప్రకారం దరఖాస్తు చేసిన 30 రోజుల్లోపు వారడిగిన సమాచారాన్ని అధికారులు ఇవాల్సి ఉంటుందని తెలిపారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని అర్హులందరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి, కార్పొరేటర్ నిడికొండ నరేంద్రబాబు, గ్రామస్తులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు



సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పరిధిలో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, నూతనంగా కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల కోర్టు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, ఏఎస్సైలతో కోర్టుల్లోని పెండింగ్ కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లపై ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేసే కేసులు, పోలీస్‌స్టేషన్లలోని కేసుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. బాధితులకు భరోసా, నేరస్తులు భయపడేలా శిక్షలు ఉండాలన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసే కోర్టు మానిటరింగ్‌సెల్‌ను ఒక సీఐ పర్యవేక్షిస్తారని, నిత్యం కేసుల పరిష్కార ప్రగతిని అంచనా వేస్తామని చెప్పారు. ఆయా కేసుల్లో బాధితులకు న్యాయం చేస్తేనే విధులు సక్రమంగా నిర్వర్తించినట్లు గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో సీజ్ చేసిన ప్రోపర్టీని కోర్టు ట్రయిల్ సమయంలో న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, దిశ స్టేషన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాస్, డీసీఆర్‌బీ ఎస్సై ప్రసాదనాయుడు, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ వి.సుధాకర్, డీసీఆర్‌బీ కోర్టు లెజన్ ఏఎస్సై సిసిల్లీ ఉన్నారు.

సొసైటీ ఉద్యోగుల డైరీ విడుదల



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా కమిటీ డైరీని స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ మొదటి కాపీ ని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్‌కు అందజేశారు. సహకార రంగం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సత్యనారాయణ పేర్కొన్నారు. నాయకులు ఆర్ లింగరాజు, పి.సుబ్బారావు, జి.వీరయ్య తదితరులు మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ ఈశ్వరి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం 47వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మందికిపైగా ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ఏలూరు నగరంలో చరిత్రలో లేని విధంగా 32 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గం పరిధిలోని జగనన్న కాలనీల్లో 16 వేల ఇళ్ల నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మాల నాయకుల సమావేశం

ఏలూరు (టూటౌన్): మాల నాయకుల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జన్మభూమి పార్కు సమీపంలో నిర్వహిస్తున్నట్లు దళిత జేఏసీ కన్వీనర్ చాగంటి సంజీవ్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణమాల మల్టీపర్పస్ భవన్ నిర్మాణంపై చర్చిస్తామని, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మాల నాయకులంతా హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఫారెస్టు బోర్డు డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, నేతల రమేష్ బాబు, తేరా ఆనంద్ కుమార్, ముంగర సంజయ్, పోలిమెట్ల మోజెస్, బొల్లారపు లక్ష్మీపతి, యడ్ల ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే ఆటో డ్రైవర్ హత్య?

ఏలూరు టౌన్: వ్యక్తిగత కారణాలతోనే స్థానిక ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంక్ సందులో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ మాణిక్యాలరావు హత్యకు గురయ్యాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దుగ్గిరాలకు చెందిన గొల్లా నరేష్ అతని సోదరుడు గొల్లా నవీన్ అదే ప్రాంతానికి చెందిన చింతలపూడి నాగార్జున, శనివారపుపేట ఇందిరానగర్‌కు చెందిన కోలా మణిలపై త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వరప్రసాద్ తెలిపారు.

30, 31 తేదీల్లో ఆందోళనలు

ఏలూరు (టూటౌన్): పోలవరం మండల ఏజెన్సీలో గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కు కల్పించాలని కోరుతూ ఈనెల 30, 31 తేదీలలో రైతు కూలీ సంఘం ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాషా తెలిపారు. జిల్లెల్లగూడెం, ప్రగడపల్లి, కోండ్రుకోట, తూటిగుంట, చేగొండిపల్లి పంచాయతీల్లోని సాగు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించాలని కోరారు.

నిస్వార్థ సేవకు సముచిత స్థానం



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ ఆరీఫ్, పార్టీ నేతలు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిస్వార్థంగా కృషి చేస్తోన్న ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచితస్థానం కల్పిస్తారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన మహ్మద్ ఆరీఫ్ స్థానిక క్యాంపు కార్యాలయంలోని నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. డైరెక్టర్‌గా నియమించడం పట్ల ఆరీఫ్ సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	12-15
బెండకాయలు	54	కంద	36
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	34
కాకర కాయలు	22-28	కీరా దోస	46
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	50
బీరకాయలు (పందిరి)	60	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	60
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	22
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	98515	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33